ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కరీంనగర్
5
జిల్లా వార్తలు
ఆదివారం 24 ఆగస్టు 2025



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

కరీంనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ పథకం అమలుపై కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో హౌసింగ్, ఆర్అండ్‌బి అధికారులతో సమీక్ష నిర్వహించారు. పైలెట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నూరుశాతం పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో 3,499 ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని లబ్దిదారులకు అవసరమైన సహకారం అందించాలని అన్నారు. పద్మనగర్, హుజూరాబాద్, జమ్మికుంటలో డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

నేడు కాంగ్రెస్ జనహిత పాదయాత్ర



- ఉప్పరమల్యాల నుంచి మధురానగర్ వరకు
- పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్, మీనాక్షి నటరాజన్, భట్టి విక్రమార్క రాక
- పాల్గొననున్న ఐదుగురు మంత్రులు
- రేపు ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో శ్రమదానం
- అనంతరం పార్టీ నేతలు, శ్రేణులతో సమావేశం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన జనహిత పాదయాత్ర ఆదివారం జిల్లాలోని చొప్పదండి నియోజకవర్గంలో జరగనున్నది. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ చేస్తున్న ఈ పాదయాత్రకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ప్రస్తుత ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లాకు చెందిన మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఉమ్మడి జిల్లా పరిధిలోని శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ఇతర ముఖ్య నేతలందరూ ఈ పాదయాత్రలో పాల్గొననున్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు వీరంతా గంగాధర మండలం కురిక్యాలకు చేరుకుంటారు. కురిక్యాలలో జెండా ఎగురవేసిన అనంతరం వాహనాల్లో ఉప్పరమల్యాలకు వెళ్తారు. అనంతరం అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి పాదయాత్రగా బయల్దేరి కురిక్యాల మీదుగా 5 కిలోమీటర్లు యాత్ర నిర్వహించి మధురానగర్ చేరుకుంటారు. అక్కడ జరిగే రోడ్‌షోలో ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. రాత్రి అదే గ్రామానికి చెందిన మ్యాక వినోద్ అనే దళిత నాయకుడి ఇంట్లో అందరూ బస చేస్తారు. సోమవారం గంగాధర మండల కేంద్రంలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో శ్రమదానం చేస్తారు. శ్రమదానం అనంతరం వెంకటాయపల్లికి చేరుకుని అక్కడ ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ నేతలు, శ్రేణులతో సమావేశం నిర్వహిస్తారు. ప్రతి ఉమ్మడి జిల్లా పరిధిలో ఒక నియోజవకర్గంలో నిర్వహిస్తున్న జనహిత పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా చొప్పదండిలో దీనిని ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని కాంగ్రెస్ నేతలు, శ్రేణులు, ప్రజాప్రతినిధులందరూ ఈ యాత్రలో పాల్గొంటారు. గడిచిన 19 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి వాటి ఫలితాలు అందుతున్న తీరుపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు ఇంకా వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం నుంచి ఆశిస్తున్న అంశాల గురించి విచారిస్తారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ప్రత్యేకంగా మహిళలతో కలుస్తారని, వడ్డీలేని రుణాలు, ఆర్టీసీ అద్దె బస్సులు, ఎలక్ట్రిక్ బస్సులు, ఇందిరా క్యాంటీన్లు నిర్వహిస్తున్న మహిళలతో చర్చిస్తారని పార్టీ ప్రకటించింది. ప్రధానంగా గ్రామస్థాయిలో ప్రభుత్వం పనితీరుపై, పార్టీ నేతలపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలు తెలుసుకుని లోటుపాట్లను సవరించుకోవడానికి స్థానిక సంస్థల ఎన్నికల నాటికి వీటన్నింటినీ చక్కదిద్దుకుని క్షేత్రస్థాయిలో

(మిగతా 8వ పేజీలో)

సభాస్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సభాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం ఆరు వేల మందితో నిర్వహించే భారీ పాదయాత్రకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఏర్పాట్లు చేశారు. మధురానగర్ చౌరస్తాలో జరిగే రోడ్ షోలో మీనాక్షి నటరాజన్, మంత్రులు ప్రసంగించనున్నారు. కురిక్యాలలో పాద యాత్ర జరిగే రోడ్డు, మధురానగర్ చౌరస్తాలో సభ స్థలాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరిశీలించారు. అనంతరం మధురానగర్‌లో మ్యాక వినోద్ దళిత నాయకుడి నివాసంలో మీనాక్షి నజరాజన్ బస చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పాదయాత్రకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలనికోరారు. ఆయనతో ఏఎంసీ చైర్మన్ జిగిరపు రజితశ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల్‌రావు ఉన్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 13న జరగనున్న లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న రాజీపడే కేసులను కోర్టుల వారీగా పరిష్కరిం చాలని ప్రిన్సిపల్ డిసిక్ట్, సెషన్స్ జడ్జి ఎస్ శివకు మార్‌ను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం కో రారు. ప్రిన్సిపల్ డిసిక్ట్, సెషన్స్ జడ్జి ఎస్ శివకు మార్‌తో కో - ఆర్డినేషన్ మీటింగ్‌లో భాగంగా శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం అయ్యారు. సైబర్ నేరాల్లో ఖాతాల్లో నిలిపివేసిన మొత్తాన్ని బాధితులకు రిఫండ్ చేసే అంశాన్ని లోక్ అదాలత్ సమయంలో మాత్రమే కాకుండా రెగ్యులర్‌గా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీసీ నెంబర్‌లు లేని కేసులకు సీసీ నెంబర్‌లు కేటాయించాలని కోరారు. సాక్షులను వర్చ్యువల్‌గా ప్రవేశపెట్టే అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ సీసీఆర్‌బీ శ్రీనివాస్ జి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో
పండుగలు జరుపుకోవాలి

- విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉల్ నబీ వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉల్ నబీ పండుగ నేపథ్యంలో శాంతి కమిటీ సభ్యులతో, ఏర్పాట్లపై అధికారులతో కలెక్టరేట్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

ఆడిటోరియంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్, విద్యుత్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో నగరంలో లో-లెవెల్‌లో ఉన్న విద్యుత్ తీగలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గణేష్ నిమజ్జనానికి వెళ్లే రూట్లలో విద్యుత్ తీగల విషయంలో ఆ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వేడుకల కోసం లైటింగ్, శానిటేషన్, బ్లీచింగ్ వంటి పనులను మున్సిపల్ ఆధ్వర్యంలో పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. అగ్నిమాపక, మైనింగ్, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో మాదిరిగానే ఈసారి కూడా గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ ఉంటుందని, మిలాన్ ఉల్ నబి వేడుకలకు ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ ఈసారి నగరంలో సుమారు 3,300 గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. నిర్వాహకులు పోలీస్ వెబ్‌సైట్‌లలో గణేష్ మండపం పూర్తి వివరాలు నమోదు చేయాలని కోరారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, ఆర్‌డీఓ మహేశ్వర్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్ బారిన పడకుండా చూడాలి

కరీంనగర్ క్రైం: మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, యువత, విద్యార్థులు మత్తుపదార్థాల బారిన పడకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణకు తీసు కుం టున్న చర్యలు జిల్లాలో సత్ఫలితాలను ఇస్తున్నాయని అన్నారు. పాఠశాలలు, వసతి గృహాలు, విద్యా సంస్థల్లో మత్తుపదార్థాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. షీ టీమ్‌లను కూడా అవగాహన కార్యక్రమాలలో భాగస్వామ్యం చేయాలన్నారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ తనిఖీలు 31,360 కేజీల గంజాయి సీజ్ చేసినట్లు తెలిపారు. 16 కేసులు నమోదు చేసి 39 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ పి శ్రీనివాస్‌రావు, నార్కొటిక్ విభాగం సీఐ పుల్లయ్య, ఆర్‌డీఓలు మహేశ్వర్, రమేష్ బాబు, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

- వెన్నంపల్లిలో డెంగీ పాజిటివ్

సైదాపూర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలో విష జ్వరాలు రోజు రోజుకు విజృంభిస్తున్నాయి. ప్రతి గ్రామంలో సుమారు 8 నుంచి 10 మంది జ్వరంతో బాధపడుతున్నారు. మండలంలోని వెన్నంపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు గత వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతూ కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు పరీక్షలు నిర్వహించి డెంగీ పాజిటివ్‌గా తెలిపారు. జాగిరిపల్లి గ్రామంలో విష జ్వరాలతో బాధపడుతూ పలువురు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందు తున్నారు. అయితే గ్రామాలలో విషజ్వరాలు పెరుగుతున్నాయని, వైద్య సిబ్బంది పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

మట్టి వినాయకుల పంపిణీ లేనట్లేనా?

- మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రతి యేటా అవగాహన
- ఈ యేడు కనిపించని కార్యక్రమాలు



కరీంనగర్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి సంవత్సరం నగరపాలక సంస్థ మట్టి వినాయకుల పంపి ణీ కార్యక్రమాన్ని చేపడుతుంది. కొన్ని సంవ త్సరాలుగా కొనసాగించడంతో నగరంలోని అనేక మంది ఇళ్లలో మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించారు. ఈ ఏడాది నగరపాలక సంస్థ ఇప్పటి వరకు మట్టి వినాయకులను తెప్పించలేదు. దీంతో ఈ యేడు పంపిణీ ఉండకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మట్టి వినాయకులను పూజించాలని ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఉచితం గా దాదాపు పదివేలకుపైగా వినాయక మట్టి వినాయకుల ప్రతిమలను నగర ప్రజలకు పంపిణీ చేసేది. నగర పాలక సంస్థను స్ఫూర్తిగా తీసుకుని వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు, కొంతమంది ప్రజా ప్రతినిధులు స్వచ్ఛందంగా మట్టి వినాయకుల పంపిణీ చేపట్టారు. ఈ నెల 27న వినాయక చవితి ఉండగా వినాయక వినాయక విగ్రహాల పంపిణీపై నగరపాలక సంస్థ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రతి ఏడూ మాదిరిగానే ఈ సంవత్సరం కూడా మట్టి వినాయకులను పంపిణీ చేయాలని తాజా మాజీ మేయర్, బీజేపీ నాయకులు యాదగిరి సునీల్‌రావు ఇటీవల నగర పాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌ని కలిసి వినతిపత్రం సమర్పిం చారు. అయినప్పటికీ నగరపాలక సంస్థ మట్టి వినాయకుల పంపిణీపై ఆస క్తి చూపకపోవడంతో నగరవాసులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

తీరని యూరియా కష్టాలు

- సైదాపూర్‌లో పోలీస్ బందోబస్తు మధ్య పంపిణీ
- లింగాపూర్ సొసైటీలో టోకెన్లు అందజేత



వెన్కేపల్లిలో సొసైటీ గోదాం ఎదుట యూరియా కోసం రైతుల పడిగాపులు

సైదాపూర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండల కేంద్రంలోని వెన్కేపల్లి సొసైటీకి శనివారం యూరియా వస్తుందనే సమాచారం మేరకు రైతులు గోదాం వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. రైతులు రోడ్డు వరకు క్యూ కట్టారు. కొంత సేపటి తరువాత 450 బస్తాల యూరియా రావడంతో సొసైటీ సిబ్బంది, వ్యవసాయాధి కారులు ఒకొక్కరికి ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు. దాంతో లైన్లో చివరి రైతులకు యూరియా అందలేదు. పంపిణీ వద్ద ఎలాంటి గొడువలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా యూరియా కొరత తీరేది ఎప్పుడు, రైతుల కష్టాలు ఆగేదెప్పుడు అని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- శంకరపట్నం: శంకరపట్నం మండలంలోని మెట్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని లింగాపూర్ సొసైటీ గోదాంకు శనివారం 450 యూరియా బస్తాలు వచ్చాయి. సమాచారం తెలుసుకున్న రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. సొసైటీ సిబ్బంది అంతకు ముందు యూరియా కోసం రైతుల జాబితా తయారు చేశారు. జాబితాలో పేరు ఉన్న రైతులకు టోకెన్లు ఇచ్చారు. లిస్టులో పేరు లేని రైతులు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. మరుసటి లోడులో వారికి ఇస్తామని సిబ్బంది హామీ ఇచ్చారు. ఒక్కో రైతుకు రెండు బస్తాలు చొప్పున పంపిణీ చేశారు.

యూరియా అందించాలని
బీఆర్ఎస్ ధర్నా

గంగాధర/చిగురుమామిడి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా అందించాలని కోరుతూ శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గంగాధర ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ రైతులు యూరియా కోసం కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారన్నారు. రైతులకు సాగునీరు, ఎరువులు అందక కష్టాలు పడుతున్నారన్నారు. రోడ్డుపై ధర్నాకు ప్రయత్నించిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



చిగురుమామిడిలో యూరియా కోసం ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులను ఈడ్చుకెళ్తున్న పోలీసులు

- చిగురుమామిడి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి, మండల రైతు సమన్వయ మాజీ అధ్యక్షుడు పెనుకుల తిరుపతి, మాజీ ఎంపిటిసి సభ్యులు కత్తు రమేష్ యాదవ్, రామోజు కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు. బొమ్మనపల్లి మాజీ ఎంపీటీసీ రమేష్ యాదవ్ ఆర్టీసీ బస్సుకు అడ్డుగా పడుకుని నిరసన తెలిపాడు. నిరసన తెలుపుతున్న నాయకులను పోలీసులు అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

రైతులకు సరిపడా యూరియా అందేలా చూడాలి

- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో సరిపడా యూరియా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. శనివారం సిద్ధిపేట, కరీంనగర్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లతో ఫోన్‌లో యూరియా నిల్వలు, సరఫరాపై మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండలాల వారీగా ప్రతి రోజు యూరియా పంపిణీపై రిపోర్టు అందజేయా లని, ఎరువుల పంపిణీలో ఎలాంటి లోపాలు లేకుండా విజిలెన్స్ మానిటరింగ్ కఠినంగా చేపట్టా లని ఆదేశించారు. యూరియా కొరత రాకుండా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ చేయాలని మంత్రి సూచించారు.

యూరియా కోసం రైతుల జాగరణ

- పంపిణీకి ఒకరోజు ముందు రాత్రి నుంచే క్యూ



ఇందుర్తిలో ఆదివారం ఇచ్చే యూరియా కోసం శనివారం రాత్రి చెప్పులు క్యూలో పెట్టిన రైతులు

చిగురుమామిడి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుర్తి గ్రామంలో యూరియా కోసం రైతులు జాగరణ చేస్తున్నారు. ఆదివారం తెల్లవారి యూరియా గ్రామానికి వస్తుందనే సమాచారంతో శనివారం రాత్రి గ్రామ రైతులు చెప్పులను క్యూలో పెట్టి అక్కడే నిద్రిస్తున్నారు. యూరియా కోసం ఈ స్థాయిలో ఇబ్బందులు ఎదుర్కోవడం ఇదే మొద టి సారి అని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అవసరమైన యూరియా ఇవ్వకపోతే రైతుల ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.



హత్యకేసులో మరో ముగ్గురు అరెస్టు

గంగాధర, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గంగాధరలో వృద్ధురాలి హత్య కేసులో ప్రధాన నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు ఎస్‌ఐ వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం గంగాధర గ్రామానికి చెందిన పెగుడ మల్లవ్వ(70)ను ఈనెల 17న హత్య చేశారు. ఈ కేసులో ఈనెల 20న ఇద్దరు నిందితులను పట్టుకోగా ప్రధాన నిందితుడు నాగిరెడ్డిపూర్‌కు చెందిన గంగరాజు, మరో ఇద్దరు సహ నిందితులు పరారీలో ఉన్నారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి శనివారం పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులవద్ద మూడు తులాల బంగారం, రెండు సెల్‌ఫోన్ల స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థినులను కరిచిన ఎలుకలు

- విచారణ చేపట్టిన ఎంఈవో



కేజీబీవీలో విచారణ చేపడుతున్న ఎంఈవో లక్ష్మీనారాయణ

శంకరపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేశవపట్నం కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న తొమ్మిది మంది విద్యార్థునులను గురువారం రాత్రి ఎలుకలు కరిచాయి. విషయం తెలుసుకున్న ఎంఈవో లక్ష్మీనారాయణ, ఎంపీవో ప్రభాకర్, మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ కేజీబీవీని శనివారం సందర్శించారు. ఎలుకల దాడిలో గాయపడిన విద్యార్థునులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఘటనపై అధికారులు వివరాలు సేకరించారు. ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు.

సౌదీ అరేబియా జైల్లో గుండెపోటుతో వ్యక్తి మృతి

- స్వగ్రామం చేరిన మృతదేహం



రాజయ్య(ఫైల్)

వేములవాడ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గ్రామానికి చెందిన దండుగుల రాజయ్య(50) అనే వ్యక్తి ఉపాధి కోసం సౌదీ అరేబియా దేశం వెళ్లాడు. అతను వెళ్లింది విజిట్ వీసా కావడంతో జూలై 24వ తేదిన అక్కడి పోలీసులు జైలుకు పంపారు. జూన్ 30వ తేదిన జైల్లో ఉండగానే గుండెపోటుతో రాజయ్య మృతిచెందాడు. దీంతో రాజయ్య మృతదేహం శుక్రవారం రాత్రి స్వగ్రామం చేరుకుంది. మృతుడికి భార్య రాజమణి, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

పడకేసిన బయోమైనింగ్

- వినియోగంలో లేని ప్లాంట్
- మెట్‌పల్లిలో పేరుకుపోతున్న ఘన వ్యర్థాలు



డంపింగ్ యార్డు వద్ద బయో మైనింగ్ ప్లాంట్ (ఫైల్)

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లోని డంపింగ్ యార్డుల్లో పేరుకుపోతున్న చెత్త నిల్వలను తగ్గించడంతో పాటు ఎరువు తయారు చేసేందుకు మెట్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన బయో మైనింగ్ ప్లాంట్ పడకేసింది. పేరుకుపోతున్న ఘన వ్యర్థాల సమస్యను పరిష్కరించేందుకు గత జూలైలో పట్టణంలోని గోధుర్ రోడ్‌లో ఉన్న డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసిన బయో మైనింగ్ ప్లాంట్ వినియోగించడం లేదు. డంపింగ్ యార్డులో వందల మెట్రిక్ టన్నులకు పైగా చెత్త పేరుకుపోయింది. జీరో డంపింగ్ యార్డు లక్ష్యంగా బయో మైనింగ్ ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు అధికారులు చెత్తను శుద్ధి చేయకపోవడంతో మెట్‌పల్లిలో డంపింగ్ యార్డు పూర్తిగా నిండిపోయింది. పక్కన ఉన్న ఖాళీ స్థలంలో



డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త చెదారం

కూడా చెత్త నిండిపోయిం ది. దీంతో డంపింగ్ యార్డు చుట్టు పక్కల వ్యవసాయం చేసే రైతులు అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారు. చెత్త పేరుకుని చుట్టు పక్కల దుర్వాసన రావడంతో పాటు డంపింగ్ యార్డు వద్ద కుక్కల బెడద కూడా అధికంగా ఉన్నది. డంప్ యార్డు పక్కన వ్యవసాయ పనులకు కూలీలు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘన వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుద్ధి చేయించాల్సిన అధికారులు వర్షాలను సాకుగా చూపుతున్నారు.

● జీరో డంపింగ్ యార్డులే లక్ష్యం

మున్సిపాలిటీలలో రోజురోజుకు పెరుకుపోతున్న చెత్త ఘన వ్యర్థాలను శుద్ధి చేసి జీరో డంపింగ్ యార్డులే లక్ష్యంగా ప్రభుత్వం బయో మైనింగ్‌కు శ్రీకారం చుట్టింది. పట్టణంలో నిత్యం టన్నులకు టన్నులు ఉత్పత్తి అవుతున్న చెత్తను పారిశుధ్య కార్మికులు సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తు న్నారు. డంపింగ్ యార్డులో నిల్వ ఉన్న వ్యర్థాలను దహనం చేయడం వల్ల వచ్చే పొగతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ పొగతో సమీప ప్రాంతాల వారు అనారోగ్యం పాలయ్యే అవకా శముంది. పెద్ద ఎత్తున చెత్త పోగుకావడంతో స్థలం సరిపోక నిల్వ ఉంచడం కష్టంగా మారింది. జాతీయ హరిత ట్రిబ్యునల్ మార్గదర్శకాల ప్రకారం మున్సిపాలిటీలలో వ్యర్థాలను కరిగించేందుకు ప్రభుత్వం బయో మైనింగ్ ప్లాంట్‌కు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో మొదటగా జగిత్యాల, కోరుట్ల మున్సిపాలిటీలలో ఏర్పాటు చేశారు. అనంతరం మెట్‌పల్లిలో ఏర్పాటు చేశారు. ఇప్పటికే జగిత్యాల, కోరుట్లలో బయో మైనింగ్ విజయవంతంగా సాగు తోంది. చెత్తతో బయో మైనింగ్ ద్వారా ఎరువు తయారు చేస్తున్నారు. మెట్ ఎల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన బయోమైనింగ్ కొన్ని రోజులు నడిపించి నిలిపివేశారు. వర్షాల కారణంగా శుద్ధి పనులు నిలిపివేసినట్లు అధికారులు చెపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బయో మైనింగ్ చేపట్టాలని మెట్‌పల్లి పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే ప్రారంభిస్తాం

-టి. మోహన్, మున్సిపల్ కమిషనర్, మెట్‌పల్లి



వర్షాల కారణంగా బయో మైనింగ్ శుద్ధి పనులు నిలిచిపోయాయి. డంపింగ్ యార్డులో ప్రస్తుతం 32 వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉంది. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే శుద్ధి పనులు చేపడుతాం. నాలుగు నెలల్లో పూర్తి స్థాయిలో జీరో డంపింగ్ యార్డుగా తీర్చిదిద్దుతాం.

ఇసుక ట్రాక్టర్ పైనుంచి పడి యువకుడి మృతి



నర్రా శేఖర్(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ గ్రామ శివారులోని దొంగలమర్రి దగ్గర శుక్రవారం రాత్రి ఇసుక ట్రాక్టర్‌పై నుంచి పడి నర్రా శేఖర్ (29) అనే యువకుడు మృతిచెందాడు. మృతుడి బంధువులు, ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మెట్‌పల్లి మండలం ఆత్మనగర్ గ్రామానికి చెందిన శేఖర్ అదే గ్రామానికి చెందిన బండ శ్రీనివాస్‌కు సంబంధించిన ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గ్రామంలో డంప్ చేసిన ఇసుకను బండలింగాపూర్‌కు తరలించేందుకు దాండ్ల రవి అనే వ్యక్తితో నర్రా శేఖర్ ట్రాక్టర్‌తో వెళ్లారు. దాండ్ల రవి ట్రాక్టర్‌ను నడుపుతుండగా శేఖర్ వెనుకలా ఉన్నాడు. ఈ క్రమంలో జగ్గసాగర్ గ్రామ శివారులో దొంగలమర్రి వద్ద ప్రమాదవశాత్తు నర్రా శేఖర్ ట్రాక్టర్‌పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. శేఖర్ భార్య ఏడు నెలల గర్భవతి కాగా, అతడికి 20 నెలల కూతురు ఉంది. శేఖర్ కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి బంధువులు మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌కు పెద్దఎత్తున తరలివచ్చారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఎస్సై సముదాయించడంతో బాధితులు వెనుతిరిగి వెళ్లారు.

అనారోగ్యం.. ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



లోకేష్(ఫైల్)

తంగళ్లపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం.. ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తంగళ్లపల్లి మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు కథనం ప్రకారం.. తంగళ్లపల్లికి చెందిన ముద్రకోల తిరుపతి-సుశీల దంపతులకు కుమారుడు లోకేష్(26), కూతురు కావ్యలు ఉన్నారు. లోకేష్ ఇంటర్ మీడియెట్ పూర్తి చేశాడు. సోదరి అనారోగ్యం భారినపడగా తల్లిదండ్రులు వైద్యం కోసం అప్పులు చేశారు. కుటుంబానికి చేదోడుగా ఉండాలని భావించి హైదరాబాద్‌లో ప్రైవెట్ ఉద్యోగంలో చేరాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురై ఉద్యోగం మానేసి స్వగ్రామంలో తల్లిదండ్రుల వద్దకు చేరాడు. అనారోగ్యంతోపాటు అప్పులు, వైద్యం చేయించుకునే పరిస్థితి లేక శనివారం తెల్లవారు జామున ఇంట్లో ఉరి వేసుకుని లోకేష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్లూకోల్ట్స్ పోలీసుల విధులకు ఆటంకం

- ముగ్గురు యువకులపై కేసు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బ్లూకోల్ట్స్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆరెపల్లికి చెందిన రాకేష్, అచ్యుత్, గుండిగోపాల్‌రావుపేటకు చెందిన ప్రవీణ్ అర్ధరాత్రి సమయంలో గ్రామంలోని దర్గా వద్ద రోడ్డు పక్కన మద్యం తాగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఈ క్రమంలో వివరాలు అడిగిన బ్లూకోల్ట్స్ పోలీసులను నెట్టివేసి, ట్యాబ్‌ను లాక్కున్నారు. ఈ ఘటనలో వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

వెల్గటూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రంలో వరంగల్-రాయపట్నం ఏడో నంబరు రాష్ట్ర రహదారిపై శనివారం నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీ 05 టీజీ 0555 నంబరు గల లారీ అతి వేగంగా ఆ వ్యక్తిని వెనుక వైపు నుంచి ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి.

గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. కాగా తీవ్ర గాయాలైన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అతనికి సంబంధించిన వివరాలు లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

హుజూరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన చల్లూరి శ్రీధర్ ఈ నెల 31న హైద్రాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 22న జిల్లా కేంద్రంలో జరిగిన యోగా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శ్రీధర్ ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వస్త్రవ్యాపారులకు కుచ్చుటోపీ

- రూ. రెండు కోట్లతో ఉడాయించిన తమిళనాడు వ్యాపారి



గర్షకుర్తిలో తాళం వేసిన ఉన్న టెక్స్‌టైల్ దుకాణం

గంగాధర, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్షకుర్తిలో ఆసాములు తయారు చేసిన వస్త్రాలను ఉద్దెరకు కొనుగోలు చేసి నమ్మించి రెండు కోట్లకు పైగా కుచ్చుటోపీ పెట్టిన తమిళనాడు వ్యాపారి మోసం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల ప్రకారం కొన్ని సంవత్సరాలుగా గర్షకుర్తిలో మగ్గాలపై తయారు చేసిన గోచి చీరెలు, తువ్వాలలు, దస్తీలను ఇక్కడి ఆసాములు ఇతర జిల్లాలకు వెళ్లి విక్రయించేవారు. దీన్ని ఆసరాగా చేసుకొని ఎనిమిది నెలల క్రితం తమిళనాడు రాష్ట్రం, క్రిష్ణగిరి జిల్లా పెరుగోపనపల్లికి చెందిన వినోద్‌రాజ్, మరో ముగ్గురు కలిసి హోల్‌సెల్ డీలర్ పేరిట కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తిలో అద్దె భవనాన్ని తీసుకుని వ్యాపారం ప్రారంభించారు. అయితే గతంలో గర్షకుర్తిలో తయారు చేసిన గోచి చీరలతో పాటు తువ్వాలలు, దస్తీలను ఇతర జిల్లాలకు వెళ్లి అమ్ముకునే ఆసాములు ఇక్కడే హోల్‌సెల్‌గా తమిళనాడుకు చెందిన వ్యాపారులకు అమ్ముకునేవారు. మొదట్లో వస్త్రాలు తీసుకుని డబ్బులు సక్రమంగా ఇచ్చి వ్యాపారులను నమ్మించారు. కొద్దిరోజులకు వీరి వ్యాపారం గర్షకుర్తితో పాటు కొత్తపల్లి, సిరిసిల్ల, కరీంనగర్ చామనపల్లి వరకు చేరింది. వ్యాపారం జోరందుకోగానే అమ్మిన సరుకు సగం డబ్బులు వ్యాపారులకు ఇచ్చి మిగతావి ఇస్తానని దాటవేశాడు. ఇలా ఒక్కొక్కరి వద్ద పది లక్షల రూపాయల నుంచి 15 లక్షల రూపాయల వరకు కొనుగోలు చేసి చీరలు, దస్తీలు, తువ్వాలలతో వారం క్రితం రాత్రికి రాత్రి ఉడాయించారు. సరుకులు తీసుకున్న వ్యాపారికి ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ రావడంతో మోసపోయామని గ్రహించిన వ్యాపారులు పోలీసులను ఆశ్రయించారు. సదరు తమిళనాడు వ్యాపారులపై కేసు నమోదు చేసిన గంగాధర ఎస్సై వంశీకృష్ణ విచారణ చేపడుతున్నామని తెలిపారు.

ఎస్‌యూ ఇంజనీరింగ్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

గణేశ్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం గాంధీనగర్ (హుస్నాబాద్)లోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 26వ తేదీన స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ కె తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీఎస్‌ఈ, ఈసీఈ, సీఎస్‌సీ, సీఎస్‌సీఏఐలో స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు కళాశాల మొదటి అంతస్తులో హాజరుకావాలని తెలిపారు. ఇప్పటి వరకు ఎక్కడా అడ్మిషన్ తీసుకోని వారికి అవకాశం ఉంటుందని, వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ www.satavahana.ac.inను సందర్శించాలని సూచించారు.

నిజామాబాద్‌లో చోరీ

కోనరావుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి నగదును దోచుకెళ్లారు. ఎస్సై ప్రశాంత్‌రెడ్డి కథనం ప్రకారం... నిజామాబాద్ గ్రామానికి చెందిన ముస్కం లింబాద్రి ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి 28 వేల రూపాయల నగదు, 17 తులాల వెండిని బీరువా తాళం పగలగొట్టి దోచుకెళ్ళారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

పలు మండలాల్లో పోలీసుల కవాతు

హుజూరాబాద్/జమ్మికుంట/వీణవంక, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక మండలంలోని చల్లూరు గ్రామంలో వినాయక చవితి, దేవి నవరాత్రుల ఉత్సవాలల్లో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో శనివారం జవాన్ల కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా రాపిడ్ యాంటీ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ టీపీ భగెల్ మాట్లాడుతూ నవరాత్రుల ఉత్సవాలు ప్రజలు చాలా సంతోషంగా, ఎలాంటి అల్లర్లు జరగకుండా శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. తెలంగాణలోని పట్టణాల్లో, గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా కవాతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో శాంతి భద్రతల కోసం రాజకీయ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, యువత శాంతియుత మార్గంలో సంరక్షించుకోవాలని సూచించారు. అనంతరం జవాన్లను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో సీఐలు కరుణాకర్, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, ఎస్‌ఐలు నాగరాజు, తిరుపతి, క్రాంతికుమార్, పోలీస్ సిబ్బంది, జవాన్లు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లికి చెందిన బుక్క హరీష్ ఈ నెల 5న విద్యారణ్యపురిలో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్ గోదావరిఖనిలో ఉన్నట్లుగా గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ రూరల్ ఠాణాలో శనివారం హరీష్‌కు సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్ అప్పగించారు.

డీజే నిర్వాహకుల బైండోవర్

రామడుగు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): త్వరలో రానున్న గణేష్ ఉత్సవాలను నేపథ్యంలో రామడుగు మండలం పరిధిలోని డీజే సౌండ్ నిర్వహించే వ్యక్తులను ముందస్తు చర్యల్లో భాగంగా తహసీల్దార్ ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు. బైండోవర్‌ను అతిక్రమించి డీజే సౌండ్ గణేష్ ఉత్సవాల్లో వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రామడుగు ఎస్‌ఐ కె రాజు హెచ్చరించారు.

నాందేడ్ నుంచి తిరుపతి మీదుగా ధర్మవరానికి ప్రత్యేక రైలు

- సెప్టెంబరు 5 నుంచి నడవనున్న రైలు

పెద్దపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని పెద్దపల్లి జంక్షన్ మీదుగా మరొక ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును దక్షిణ మధ్య రైల్వే జోన్ నాందేడ్ డివిజన్ రైల్వే అధికారులు నడపనున్నారు. ఈ రైలు వచ్చే నెల 5వ తేదీ నుంచి ప్రతీ వారం నాందేడ్ నుంచి ధర్మవరం వరకు నడుస్తుంది. 07189 నాందేడ్ నుంచి ధర్మవరం ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం నాందేడ్‌లో సాయంత్రం 4:30 నిమిషాలకు బయలుదేరి, బాసర నుంచి 6 గంటలకు, నిజామాబాదు జంక్షన్ 6:25 గంటలకు, జగిత్యాల రాత్రి 8 గంటలకు, కరీంనగర్ రాత్రి 9 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 10:05 గంటలకు, వరంగల్‌కు రాత్రి 11:40 గంటలకు చేరుకుంటుంది. తిరుపతికి శనివారం ఉదయం 11 గంటలకు, పాకాల జంక్షన్, పీలేరు, మదనపల్లి రోడ్డు, కదిరి రైల్వే స్టేషన్ల మీదుగా, ధర్మవరం జంక్షన్‌కు సాయంత్రం 5 గంటలకు చేరుకుంటుంది. ఈ రైలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో లింగంపేట జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జంక్షన్, జమ్మికుంట రైల్వే స్టేషన్‌లలో ఆగుతుంది. ఈ రైలు సెప్టెంబర్ 5, 12, 19, 26 తేదీల్లో నడవనున్నది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు నంబర్ 07190 ధర్మవరంలో సెప్టెంబర్ 7, 14, 21, 28 తేదీల్లో ప్రతీ ఆదివారం ఉదయం 5:39 గంటలకు ఆరంభమై, ఆ మరుసటి రోజు ఉదయం 7:30 గంటలకు నాందేడ్‌కు చేరుకుంటుంది. పెద్దపల్లి జంక్షన్‌కు సోమవారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేరుకుంటుంది.

పాడి ఆవు.. లేగదూడను ఎత్తుకెళ్లిన దుండగులు

శంకరపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన ఓ రైతు పాడి ఆవు, లేగ దూడను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి ఎత్తుకెళ్లారు. బాధిత పాడి రైతు చిలివేరు మధునయ్య రోజు లాగానే సాయంత్రం ఆవు, లేగ దూడను తన పొలం వద్ద మేత వేసి కట్టేసి వచ్చాడు. శనివారం తెల్లవారు జామున వెళ్లి చూసేసరికి ఆవు, లేగ దూడను గుర్తు తెలియని వ్యక్తులు తరలించుకుపోయారని లబోదిబోమన్నాడు. వాటి విలువ సుమారు రూ. 80 వేల వరకు ఉంటుందన్నారు. ఆవు, లేగ దూడ అపహరణపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు.

అర్బన్ బ్యాంకు ఎన్నికలకు కసరత్తు


- సెప్టెంబరు 30లోగా నిర్వహణకు ఏర్పాట్లు - 9100 ఓట్లతో ఓటరు జాబితా సిద్ధం - కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికల నిర్వహణకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. తాత్కాలిక ప్రస్తుత పాలకవర్గ పదవీకాలం అక్టోబరు 13తో ముగియనున్నందున ఆలోగా ఎన్నికలను నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ కారణాలతో కొన్ని సంవత్సరాలుగా పాలకవర్గ ఎన్నికలు వాయిదా పడడంతో పాలకవర్గాలను ప్రభుత్వం నియమిస్తోంది. పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలంటూ కోర్టు ఆదేశించడంతో అధికారులు, ప్రస్తుత పాలకవర్గ సభ్యుల సహకారంతో ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తోంది. బ్యాంకు సభ్యత్వాల్లో అవకతవకలకు పాల్పడ్డారని అధికారుల ప్రాథమిక విచారణతో కోర్టు గత పాలకవర్గంలోని 15 మంది సభ్యుల సభ్యత్వాలను తొలగించాలంటూ ఈ నెల 1న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ నెల 3న నిర్వహించిన పాలకవర్గ సర్వసభ్య సమావేశంలో 15 మంది సభ్యులను శాశ్వతంగా తొలగిస్తున్నట్లు తీర్మానించారు. దీన్ని ఖండించిన ఆనాటి పాలకవర్గ సభ్యులు కోర్టును ఆశ్రయించడంతోపాటు జిల్లా సహకార శాఖ అధికారిని కలిసి సభ్యత్వాల రద్దు విషయమై పలు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. తాము అవకతవకలకు పాల్పడలేదని, సంజాయిషీ నోటీసు ఇవ్వకుండా అభిప్రాయాలను స్వీకరించకుండా కొందరు అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికతో సభ్యత్వాలు రద్దు చేయడం సరికాదని పేర్కొన్నారు. అంతేకాకుండా సర్వసభ్య సమావేశం ఎజెండాలో సభ్యత్వాల రద్దు విషయాన్ని చేర్చకపోవడం చట్ట విరుద్ధమని, దీనిపై చర్య తీసుకోవాలని కోరారు. దీంతో జిల్లా సహకార శాఖ అధికారి బ్యాంకు పాలకవర్గం సభ్యుల సభ్యత్వాల రద్దుపై తీసుకున్న నిర్ణయం సరికాదని, మళ్లీ నిర్ణయం తీసుకోవాలంటూ ఇటీవల పాలకవర్గానికి లేఖ పంపించారు. ఈ నేపథ్యంలో గత పాలకవర్గ సభ్యుల సభ్యత్వాల రద్దుపై సస్పెన్షన్ కొనసాగుతోంది.

మరోవైపు ఎన్నికలు నిర్వహించాలంటూ ఇప్పటికే కోర్టు ఆదేశించడం, ప్రస్తుత పాలకవర్గం కూడా ఎన్నికలు నిర్వహిస్తామని కోర్టుకు చెప్పడంతో పాలకవర్గ ఎన్నికలు అనివార్యంగా మారాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలను నిర్వహించేందుకు బ్యాంకు అధికారులు సహకార చట్టం నిబంధనల మేరకు ఓటరు లిస్టును సిద్ధం చేసి జిల్లా సహకారశాఖ అధికారికి, ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిసింది. మరోవైపు గత ఓటరు లిస్టును సవరించి 9,100 పైచిలుకు ఓట్లతో ఓటరు జాబితాను సిద్ధం చేశారు. ఈసారి డివిజన్ల వారీగా ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కరీంనగర్, జగిత్యాల బ్రాంచీల్లో ఓటర్లు ఉన్నందున కరీంనగర్‌లో 10 డివిజన్లుగా, జగిత్యాలలో ఒక డివిజన్‌ను ఏర్పాటు చేసి దాదాపు 1,000 ఓట్లతో ఒక్కో డివిజన్ ఉండేలా చర్యలు చేపట్టారు. ఓటరు జాబితాతోపాటు డివిజన్ల వారీగా ఎన్నికలు నిర్వహించేందుకు దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే ఎన్నికలను నిర్వహిస్తామని అధికారులు, ప్రస్తుత పాలకవర్గ చైర్మన్ తెలిపారు.

మరోవైపు కాంగ్రెస్‌కు చెందిన ప్రస్తుత పాలకవర్గంతోపాటు మాజీ పాలకవర్గ సభ్యులు ఎన్నికల్లో ఆమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్‌కు చెందిన రెండు గ్రూపులు విమర్శలు గుప్పించుకుంటూ అర్బన్ బ్యాంకు రాజకీయాలను రసవత్తరంగా మార్చుతుండగా బీజేపీ, బీఆర్ఎస్ ఇతర పార్టీలు పెద్దగా ఆసక్తి చూపినట్లు కనిపించడం లేదు.

బడికి తాళం వేసి తల్లిదండ్రుల నిరసన



తాళం వేసి నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పాఠాలు చెప్పేందుకు పాఠశాలలో ఒక్కరే ఉపాధ్యాయుడు ఉండడం వల్ల తమ పిల్లలు నష్టపోతున్నారని, మరో ఉపాధ్యాయుడిని కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధాన గేటుకు శనివారం తాళం వేసి తల్లిదండ్రులు విద్యార్థులతో కలిసి నిరసనకు దిగారు. బడిలో మొత్తం 28 మంది విద్యార్థులుండగా ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహించేవారని పేర్కొన్నారు. ఇటీవల ఓ ఉపాధ్యాయినిని విద్యా శాఖ అధికారులు డిప్యూటేషన్‌పై వేరే మండలానికి పంపించారని చెప్పారు. ఒక్కరే ఉపాధ్యాయుడు అన్ని తరగతులకు ఎలా బోధిస్తారని ప్రశ్నించారు. సుమారు గంటపాటు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న విద్యాశాఖ అధికారులు స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులతో సెల్‌ఫోనులో మాట్లాడి ఉపాధ్యాయుడిని కేటాయించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

కోర్టును ఆశ్రయించిన అదనపు కమిషనర్ సువార్త

కరీంనగర్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ జె సువార్త హైకోర్టును ఆశ్రయించారు. విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని ఆమెపై అసంతృప్తితో ఇటీవల మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సీడీఎంఏకు సరెండర్ చేశారు. అయితే ఆమె సీడీఎంఏకు వెళ్లకుండా యధావిధిగా రెండు రోజుల పాటు కార్యాలయానికి వచ్చి తన ఛాంబర్‌లో కూర్చున్నారు. విషయం తెలుసుకున్న కమిషనర్ శుక్రవారం ఆమెకు కేటా యించిన విధులను ఇతర అధికారులకు అప్పగిస్తూ సర్క్యులర్ జారీ చేశారు. ఆమె వద్ద నుంచి రికార్డులను స్వాధీనం చేసుకోవాలని, ఛాంబర్ ఖాళీ చేయించాలని ఆదేశించారు. దీంతో అధికారులు ఆమె ఛాంబర్ తాళం పగులగొట్టి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై అసంతృప్తిగా ఉన్న ఆమె హైకోర్టును ఆశ్రయించి న్యాయం చేయాలని కోరగా హైకోర్టు స్పందిస్తూ స్టేటస్‌కో మెయింటేన్ చేయాలని, తదుపరి విచారణ అక్టోబరు 8వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులిచ్చింది.

రోడ్డు బాగుచేయాలని విద్యార్థుల రాస్తారోకో

ఇల్లంతకుంట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) గుంతల రోడ్డుపై వెళ్లలేమంటూ విద్యార్థులు రాస్తారోకో చేపట్టారు. మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాలకు వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు ప్రతిరోజు ఆటోల్లో వస్తుంటారు. అనంతారం, రహీంఖాన్‌పేట, వెల్జిపూర్, ఒగులాపూర్ తదితర గ్రామాల రోడ్లు పూర్తిగా చెడిపోయాని పేర్కొంటు శనివారం పాఠశాల విద్యార్థులు నిరసన తెలిపారు. విద్యార్థులకు ఏబీవీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా రాష్ట్ర నాయకుడు అక్కెం నాగరాజు మాట్లాడుతు మండలంలోని రోడ్లు పూర్తిగా చెడిపోయాయని చిన్నవర్షాలకే పొలాలను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థులు సమయానికి రాలేకపోతున్నారని పేర్కొన్నారు.

రోడ్లు బాగుచేయాలని అనేకసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకపోతామని నచ్చజెప్పడంతో విద్యార్థులు నిరసన విరమించారు.



రహీంఖాన్‌పేటలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

వ్యవసాయ క్షేత్రంలో నిఘా నేత్రం

- సోలార్ సిస్టంతో సీసీ కెమెరా ఏర్పాటు



ఎండపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మోటర్లు చోరీకి గురి కాకుండా ఎండపల్లి మండలం మారేడుపల్లి గ్రామానికి చెందిన తనుగుల సతీష్ అనే యువ రైతు తన వ్యవసాయ క్షేత్రంలో సీసీ కెమెరా ఏర్పాటు చేసుకున్నాడు. ఈ సీసీ కెమెరా విద్యుత్‌తో సంబంధం లేకుండా సోలార్‌సిస్టంతో పనిచేస్తుంది. దీని కోసం రైతు ఎనిమిది వేల రూపాయలు ఖర్చు చేశాడు. పొలంలో సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగల నుంచి, అడవి పందుల నుంచి పంట ఉత్పత్తులను కాపాడుకోవచ్చని రైతు సతీష్ తెలిపాడు.

రోస్టర్ విధానంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు అన్యాయం

ఇల్లంతకుంట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) రోస్టర్ విధానంలో ఎస్సీఎస్టీ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని పేర్కొంటు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నికోలస్‌కు బహుజన టీచర్స్‌ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. హైద్రాబాద్‌లో శనివారం కలిసి సమస్యలు విన్నవించారు. ఉపాధ్యాయుల పదోన్నతులలో ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం సరిగా లేదన్నారు. పాఠశాలల పర్యవేక్షణకు జిల్లాస్థాయిలో సబ్జెక్ట్ నిపుణులను నియమించాలని, అప్పుడే మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉందన్నారు, అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో బీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎలా కిషన్, సంఘనాయకులు జాడి రాజన్న, జాదవ్ వెంకట్రావునాయక్, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

- ఐదు రోజులుగా సమ్మెలో కార్మికులు
- వంటావార్పుతో వినూత్న నిరసన..
- యజమానులతో చర్చలు విఫలం

టెక్స్‌టైల్ పార్క్ సమ్మె ఉధృతం



ప్రధాన ద్వారం ఎదుట కార్మికులు వంటావార్పు



టెక్స్‌టైల్ పార్కు ప్రధాన ద్వారం

తంగళ్లపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల సాధన కోసం టెక్స్‌టైల్ పార్కు పవర్ లూం కార్మికులు సమ్మె ఉధృతం చేశారు. ఐదు రోజులుగా కార్మికులు సమ్మెబాట పట్టి ఆందోళన చేస్తున్నారు. దీంట్లో భాగంగా శనివారం తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి టెక్స్‌టైల్ పార్కు ప్రధాన ద్వారం ముందు కార్మికులు వంటావార్పుతో నిరసన వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా టెక్స్‌టైల్ పార్కు కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నారు. గతంలో యజమానులు, చేనేత జౌళి శాఖ అధికారులకు కూలి పెంపు తదితర సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు సమర్పించారు. యజమానులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఒక్కరోజు సమ్మె చేశారు. అయినా యజమానులు, అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో నిరవధిక సమ్మెకు దిగుతామని ప్రకటించారు. కార్మికుల సమ్మె నోటీస్‌ను అధికారులు, యజమానులు పట్టించుకోకపోవడంతో ఈనెల 19వ తేది నుంచి కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారు.

● ప్రధానంగా డిమాండ్లు..

కార్మికులు ప్రధానంగా మూడు డిమాండ్లతో సమ్మె బాట పట్టారు. టెక్స్‌టైల్ పార్కులో ప్రభుత్వ ఆర్డర్ వస్త్రాలకు సంబంధించి కార్మికులకు రోజుకు రూ.1000 వేతనం వచ్చే విధంగా కూలి నిర్ణయించి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రైవేట్ వస్త్రాలకు 10 పిక్కులకు 50 పైసలు కూలీ పెంచి అందివ్వాలని, కార్మికులకు ప్రతి సంవత్సరం 15 రోజుల వేతనం బోనస్‌గా అందించాలనే డిమాండ్లతో సమ్మె బాట పట్టారు.

● ఐదు రోజులుగా సమ్మె..

కార్మికులు ఐదు రోజులుగా సమ్మె బాట పట్టి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 19, 20వ తేదిన టెక్స్‌టైల్ పార్కులో ర్యాలీ నిర్వహించి ప్రధాన ద్వారం వద్ద ధర్నా నిర్వహించారు. 21వ తేదిన జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి నేతన్న విగ్రహానికి వినతిపత్రం ఆందించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 22వ తేదిన ఏడీ కార్యాలయం ఎదుట ధర్నా చేసి అధికారులకు వినతి పత్రం సమర్పించారు. శనివారం టెక్స్‌టైల్ ప్రధాన ద్వారం ఎదుట వంటావార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్మికులకు మద్దతుగా సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్రఅధ్యక్షుడు మూషం రమేశ్, జిల్లా అధ్యక్షులుకోడంరమణలుఆందోళనలో పాల్గొన్నారు.

● చర్చలు విఫలం..



యజమానులతో చర్చలు జరుపతున్న కార్మికులు

కూలీ పెంపు విషయంపై నిన్న అధికారులతో జరిగిన చర్చలు.. నేడు యజమానులతో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. కార్మికుల సమ్మెబాట పట్టడంతో చేనేత జౌళి శాఖ అధికారులు శుక్రవారం కార్మికులతో చర్చలు జరిపారు. ముందుగా సమ్మె విరమించాలని వారం రోజుల్లో కూలి పెంచే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పడాన్ని తిరస్కరించి సమ్మె కొనసాగించారు. కార్మికులు, యజమానులను సమన్వయం చేసి శనివారం చర్చలు జరిపించింది. అధికారులు వారం రోజులు గడువు అడిగిన విధంగానే యజమానులు సైతం అదే విధంగా ముందుగా సమ్మె విరమిస్తే వారం రోజుల్లోగా కూలి పెంపు విషయంపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతో కార్మిక సంఘ నాయకులు, కార్మికులు సమ్మె విరమించేది లేదని ముందుగా కూలీ పెంపుపై హామీ ఇస్తేనే సమ్మె విరమిస్తామని తేల్చి చెప్పారు. రెండు రోజుల్లో రెండుసార్లు జరిగిన చర్చలు విఫలమయ్యాయి.

కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు..

- కోడం రమణ, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు



టెక్స్‌టైల్ పార్కులో కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ప్రభుత్వ స్పందించి కార్మికులకు కూలి పెంచి న్యాయం చేయాలి. కార్మికుల ఉపాధి కోసం ప్రభుత్వం ఆర్డర్లు ఇస్తోంది. దానికి అనుగుణంగా కార్మికులకు కనీసం రోజుకు రూ.1000 వేతనం అందే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్ వస్త్రానికి 10 పిక్కులకు కనీసం 50పైసలు పెంచాలి. అధికారులు, పాలకులు తక్షణమే చర్యలు చేపట్టాలి.

కూలి పెంచాలి..

- ఆకుబత్తిని శ్రీకాంత్, టెక్స్‌టైల్ పార్కు కార్మికుడు



కూలి ఒప్పందం ముగిసి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు కూలి పెంపు ఊసే ఎత్తడంలేదు. ధరలకు అనుగుణంగా కూలి పెంచాలి. అధికారులు స్పందించి కూలి పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతుండగా కూలి మాత్రం పెరగడం లేదు.

కార్మికులతో చర్చలు జరుపుతున్నాం..

-రాఘవరావు, ఏడీ టెక్స్‌టైల్ పార్కు

సమ్మె విరమణకు కార్మికులతో చర్చలు జరుపుతున్నాం. రెండుసార్లు జరపగా విఫలమయ్యాయి. శనివారం యజమానులు, కార్మికులను సమన్వయం చేసి చర్చలు జరిపించాం. సానుకులంగా చర్చలు జరిగినప్పటికి చివరికి విఫలయ్యాయి. కార్మికుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలో సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

తండ్రి ఏఎస్ఐ.. కొడుకు ఎస్ఐ

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా రాజయ్య విధులు నిర్వహిస్తున్నారు. గంభీరావుపేట ఎస్ఐగా పనిచేస్తున్న రాజయ్య తనయుడు రమాకాంత్ ఎస్ఐగా శనివారం బదిలీపై బోయినపల్లికి వచ్చారు. ఉమ్మడి జిల్లాలోని మానకొండూరు మండలం వేగురుపల్లికి చెందిన రమాకాంత్ 2018లో ఎస్ఐగా ఎంపికయ్యారు. తండ్రి విధులు నిర్వహిస్తున్న పోలీస్ స్టేషన్‌కే తనయుడు ఎస్ఐగా రావడంతో వారిలో ఆనందం వెల్లివిరుస్తోంది.

ఎమ్మెల్యే కవ్వంపల్లికి పరామర్శ



ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను పరామర్శిస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను, కుటుంబ సభ్యులను రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి శనివారం పరామర్శించారు. ఎమ్మెల్యే సోదరుడు కవ్వంపల్లి రాజేశం ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మంత్రి వివేక్ వెంకటస్వామి కరీంనగర్‌లో ఎమ్మెల్యేను కలిశారు. బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్మెర రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



కొండగట్టులో క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. శ్రావణ మాసం చివరి రోజు అమావాస్య సందర్భంగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. రాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి చేరుకున్న భక్తులు రాజన్నను దర్శించుకుని తరించారు. రాజన్నకు ఎంతో ఇష్టమైన కోడెమొక్కులు చెల్లించుకున్నారు. కాగా ఈనెల 27వ తేదిన రాజన్న ఆలయంలోని నాగిరెడ్డి మండపంలో వినాయక విగ్రహాన్ని నిలిపేందుకు ఆలయాధికారులు ఏర్పాట్లు చేశారు.

అంజన్న సన్నిధిలో..

మల్యాల: మండలంలోని కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు అంజన్న సన్నిధికి వచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు ఇతరాత్ర పూజలు నిర్వహించి బేతాళుడు, రాములవారిని కూడా దర్శించుకున్నారు. స్వామి వారికి ఆలయ అర్చకులు చందనాభిషేకం, నిత్య పూజలు జరిపారు.

● ధర్మపురి క్షేత్రంలో..

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. స్థానిక లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ ఆలయాల్లో ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించి ఆలయాలకు చేరుకుని అభిషేకం, అర్చన, హోమం, నిత్య కల్యాణం చేయించారు. స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

మైనార్టీ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు

తిమ్మాపూర్/కరీంనగర్ రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న తెలంగాణ మైనార్టీస్ గురుకుల కళాశాల(బాలుర), కరీంనగర్ విట్స్ క్యాంపస్, రేకుర్తిలో గల తెలంగాణ మైనార్టీస్ గురుకుల కళాశాల (బాలికల)లో ఈ విద్య సంవత్సరం 2025-2026 నుంచి ఐఐటీ, నీట్ కోర్సులకు ఉచిత శిక్షణతో ప్రత్యేక తరగతులు ప్రారం భం అవుతున్నాయని మైనార్టీ గురుకులాల సమన్వయకర్త కె సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మైనార్టీస్(ముస్లిం, జైనులు, బుద్ధులు, సిక్కులు, పార్సీలు) నాన్ మైనార్టీస్(ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ)ల నుంచి ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు 26వ తేదీ లోపు సమర్పించాలని, ఈ నెల 29న ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు విట్స్ క్యాంపస్‌లోని ఆర్ఎల్‌సీ కార్యాల యంలో, ఇతర వివరాలకు 7331170869, 7331170843, 7033117844 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ ప్రవేశాల గడువు పొడిగింపు

గణేశ్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2025-26 విద్యా సంవత్సరానికి ఓపెన్ డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు ఈనెల 30 వ తేదీ వరకు గడువు ఉందని ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వరలక్ష్మి, కోఆర్డినేటర్ డాక్టర్ మనోజ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్, ఐటీఐ, డిప్లొమా విద్యార్థులు టీఎస్ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసి రశీదు పొందాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 7382929755 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఒక్క ఎకరాలకు అదనంగా నీరిచ్చినా ముక్కుకు నేలకు రాస్తా..

- బీఆర్ఎస్ నాయకులకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో చొప్పదండి నియోజకర్గానికి ఒక్క ఎకరానికి అదనంగా నీరిచ్చినట్టు నిరూపిస్తే తన ముక్కు నేలకు రాస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బీఆర్ఎస్ నాయకులకు సవాలు విసిరారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే జనహిత పాదయాత్రతో ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ పీఠం కదులుతుందన్నారు. గంగాధర మండలంలో జన సునామి రాబోతోందన్నారు. పదేళ్లలో పేదలకు బీఆర్ఎస్ ఒక్క ఇంటినీ నిర్మించి ఇవ్వలేదని, ఇప్పుడు నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేశామని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్నవారందరికీ అందిస్తున్నామని అన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో పదేళ్లలో ఒక్కపనీ చేయలేదన్నారు. నియోజకవర్గానికి నీరివ్వకుండా ఎండబెట్టి గాయత్రి పంపుహౌస్ ద్వారా సిరిసిల్ల, గజ్వేల్ నియోజకవర్గాల్లో పారించు కున్నారని విమర్శించారు. నియోజకర్గంలో అదనంగా ఒక్క ఎకరాకు నీరిచ్చినట్టు నిరూపించినా ముక్కుకు నేలకు రాస్తానని ఎమ్మెల్యే సవాలు విసిరారు. బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు చిల్లరగాళ్లకు డబ్బులు ఇచ్చి న్యూసెన్స్ చేయాలని చూస్తున్నారని, నాలుక చీరేస్తామని హెచ్చరించారు. కేసీఆర్ కొండగట్టుకు రెండుసార్లు వచ్చి రూ.500 కోట్లు ఇస్తామన్నారని, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని అన్నారు. నియోజకవర్గానికి ఒక్క ప్రాజెక్టు, పరిశ్రమ, విద్యాసంస్థకానీ తీసుకురాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో త్వరలోనే గంగాధరలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో చొప్పదండి నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. జనహిత పాదయాత్రలో అన్నివర్గాలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఎరువులపై మూడు జిల్లాల కలెక్టర్లతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నామని, కొందరు కావాలని కృత్రిమ కొరత సృష్టించే యత్నం చేస్తున్నారని విమర్శించారు. నారాయణపూర్ ప్రాజెక్టు భూసేకరణకు త్వరలోనే రూ.43 కోట్లు మంజూరవుతాయన్నారు. గంగాధర మండలం ఉప్పర మల్యాల నుంచి కురిక్యాల ద్వారా మధురానగర్ ఎక్స్ రోడ్ వరకు పాదయాత్ర సాగుతుందని, అక్కడే సభ ఉంటుందని తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరుకానున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్, టీపీసీసీ నాయకులు రుద్ర సంతోష్, రహమత్ హుస్సేన్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్, పులి అంజనేయులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ నిర్వాసితుల త్యాగం మరువలేనిది

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల త్యాగం ఎప్పటికీ మరువలేనిదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో శనివారం కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలవాగు నుంచి రాజన్న ఆలయం వరకు రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేపట్టనున్నామని తెలిపారు. పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. అభివృద్ధిలో అందరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంద్రగిరి శ్రీనివాస్, సాగరం వెంకటస్వామి, కనికరపు రాకేష్, పుల్కం రాజు, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

గోదావరిలోకి కొనసాగుతున్న నీటి విడుదల

- ఎస్సారెస్పీ 16 గేట్ల నుంచి ... 49,280 క్యూసెక్కులు దిగువకు







గేట్ల ద్వారా దిగువకు ఉరకలేస్తున్న శ్రీరాంసాగర్ నీరు, గాయత్రి పంపుహౌస్ నుంచి విడుదలవుతున్న నీరు, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి విడుదల అవుతున్న నీరు

జగిత్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల శనివారం కొనసాగింది. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు ఎక్కువగా వస్తుండడంతో 16 గేట్ల ద్వారా 49,280 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. కాగా ఎస్సారెస్పీలోకి 75 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 79.263 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద గేట్లు పైకి ఎత్తడం, కాకతీయ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 78,812 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 20,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 3,500 క్యూసెక్కులు వదులుతున్నారు.

శ్రీపాద ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద

అంతర్గాం: జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద కొనసాగుతున్నది. శుక్రవారం సాయంత్రం వరకు వరద తగ్గుముఖం పట్టడంతో గేట్లు మూసేసిన అధికారులు వరద పెరగడంతో మళ్లీ శనివారం గేట్లు తెరిచారు. ఎగువ ప్రాంతం నుంచి 86,775 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, గోదావరిలోకి 10 గేట్ల, ద్వారా 80200 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. నంది పంప్‌హౌస్‌కు 6300 క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా, అక్కడి నుంచి గాయత్రి పంప్‌హౌస్ ద్వారా మిడ్ మానేరులోకి 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, 19.730 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

గాయత్రి పంపుహౌస్ నుంచి..

రామడుగు: రామడుగు మండలం గాయత్రి లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి నీటి విడుదల కొనసాగుతుంది. ప్రస్తుతం రెండు పంపుల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని అధికారులు గ్రావిటీ కెనాల్ ద్వారా విడుదల చేశారు. అది నేరుగా వెళ్లి వరద కాలువలో కలుస్తుంది. ఎస్సారెస్పీ నుంచి 16,000 క్యూసెక్కుల నీరు వరద కాలువ 99 కిలోమీటర్ల వద్ద కలుస్తున్నాయి. దీంతో ప్రస్తుతం వరద కాలువకు 22,600 క్యూసెక్కుల నీరు చేరుతున్నది. మిడ్ మానేరుకు 22,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ద్వారా నీటి ప్రవాహం కొనసాగు తోంది. ప్రాజెక్టులోకి శనివారం సాయంత్రం వరకు 21,368 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతుంది. ఇందులో ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 15,068, గాయత్రి పంప్‌హౌస్ నుంచి 6,300 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. మిడ్ మానేరు ప్రాజెక్టు నుంచి ప్యాకేజి 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 9600, ఎల్ఎండీ ప్రాజెక్టుకు నాలుగు గేట్లను మీటరుపై కెత్తి 8,018 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు గాను ప్రస్తుతం 313.79 నీటినిల్వ సామర్థ్యం 27.55 టీఎంసీలకు గాను 17.936 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి..

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి మూడు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.31 టీఎంసీలకు చేరుకుంది. మధ్యమానేరు ద్వారా 9600 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఎగువన ఉన్న 11వ ప్యాకేజీలోని రంగనాయకసాగర్‌కు 6600 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

ఎనిమిది టీఎంసీలకు చేరిన దిగువ మానేరు

తిమ్మాపూర్: కరీంనగర్ పరిధిలోని ఎల్ఎండీ రిజర్వాయర్ నీటి మట్టం ఎనిమిది టీఎంసీలకు చేరుకుంది. ఎగువన ఉన్న శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ (మధ్య మానేరు) రిజర్వాయర్ నుంచి నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఎగువ నుంచి క్యూసెక్కుల నీరు మొత్తం 12,262 క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటిమట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.261 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఉధృతంగా వరద కాలువ

గంగాధర: వరద కాలువలో శ్రీరాంసాగర్ నీరు ప్రమాదకరంగా ఉధృతంగా ప్రవహిస్తోంది. పదిహేనేళ్లలో ఎన్నడు ఇంతటి వరద ప్రవాహం చూడలేదని రైతులు అంటున్నారు. గంగాధర మండలంలోని ర్యాలపల్లి, కొండయ్యపల్లి, నాగిరెడ్డిపూర్, కొండన్నపల్లి, తాడిజెర్రి, రంగరావుపల్లి, గర్శకుర్తి, గట్టుబూత్కూర్, ఆచంపల్లి గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ పంపు మోటార్లు, స్టార్టర్లు వరద ఉధృతికి కొట్టుకుపోయినట్లు తెలిపారు. అధికారులు ఇంతపెద్ద ఎత్తున నీరు విడుదల చేస్తున్నట్లు కనీస సమాచారం అందించలేదని రైతులు వాపోతున్నారు. ఇక లక్ష్మీపూర్ గాయత్రీ పంపుల్లో రెండు మోటర్ల ద్వారా ఆరు వేలు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 19,000 క్యూసెక్కులు మొత్తం 25,000 క్యూసెక్కుల నీరును వరద కాలువ నుంచి మిడ్ మానేరుకు తరలిస్తున్నారు. నాగిరెడ్డిపూర్ గేట్ల వద్ద నీటిపారుదల శాఖ ఎస్ఈ రమేష్, డీఈ రూప్లా నాయక్, ఏఈ రఘురాంలు వరద కాలువ నీటిని శనివారం పర్యవేక్షించారు.



ఎల్ఎండీలో ఉన్న నిల్వ ఉన్న నీరు

● సంక్షిప్తంగా..

గణేశ్‌నగర్: శాతవాహన విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్ సహాయ ఆచార్యుల అసోసియేషన్ విశ్వవిద్యాలయ అధ్యాపకులైన డాక్టర్ మనోహర్, గోదావరిఖని పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియామకమైన సందర్భంగా సన్మానించారు.

కరీంనగర్ కల్చరల్: మహాకవి దాశరథి కృష్ణమాచార్య శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, సర్వే జనాః సుఖినోభవంతు సంస్థల ఆధ్వర్యంలో అందించే ప్రత్యేక పురస్కారానికి జిల్లాకు చెందిన రచయిత, భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ ఎంపికైనట్లు అధ్యక్షుడు డాక్టర్ సూర్యనారాయణ పేర్కొన్నారు.

గణేశ్‌నగర్: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్య ఈనెల 25న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద చేపట్టనున్న సత్యగ్రహ దీక్షను విజయవంతం చేయాలని బీసీ సంఘాల నాయకులు కోరారు.

భగత్‌నగర్: లక్షెట్టిపేట పరిసర ప్రాంత పేదలకు రేకుర్తి కంటి ఆస్పత్రి వైస్ చైర్మన్ చిదుర సురేష్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించారు.

గంగాధర: రాష్ట్రం ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చినందుకు పాదయాత్ర చేస్తున్నారా అని కాంగ్రెస్ నాయకులను బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎం ప్రభాకర్‌యాదవ్ ప్రశ్నించారు.

తిమ్మాపూర్: మండలంలోని మొగిలిపాలెంలో మెడికవర్ అనుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

చొప్పదండి: రాష్ట్ర ప్రభుత్వం వినాయక మండపాల ఏర్పాటు చేసుకునే వారు అనుమతులు తీసుకోవాలంటూ విధిస్తున్న ఆంక్షలు తగవని బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ గౌడ్ అన్నారు.

● మండలంలోని రుక్మాపూర్ మోడల్ స్కూల్‌లో మాక్ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఓటు వేశారు.

● చొప్పదండి మండలంలోని జనరల్ స్టోర్స్, ఫొటో ఫ్రేమ్స్ దుకాణాలపై ఫొటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడిగె అజయ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐ నరేష్ రెడ్డికి ఫిర్యాదు చేశారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు రన్నింగ్ రేస్, స్టోన్ రేస్, ఫ్రాగ్ రేస్ తదితర క్రీడల పోటీలను నిర్వహించారు.

సైదాపూర్: సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ తపస్ మండలాధ్యక్షుడు ధ్యావనపల్లి శ్రీకాంత్‌రావు సైదాపూర్ తహసీల్దార్‌కు శ్రీనివాస్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు.

రోబోట్స్ ఎడ్యుకేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

● కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సోహం అకాడమీ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న రోబోట్స్ ఎడ్యుకేషన్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసు కోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సప్తగిరికాలనీ కస్తూర్బా విద్యాయలంలో విద్యా ర్థుల రోబోటిక్స్ ప్రయోగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా సైన్స్ మ్యూజియం లోనూ గదిని కేటాయించి రోబోట్స్ ఏర్పాటు చేయాలని, పిల్లలకు అవగాహన వస్తుందని అన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, సోహం అకాడమీ ఫౌండర్ సహదేవ్, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి క్వాలిటీ కో-ఆర్డినేటర్ అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటల పోటీలు

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా సప్తగిరి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రాథమిక, అంగన్‌వాడీ చిన్నారులకుఆటలపోటీలను కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు జిల్లా యువ జన క్రీడా అధికారి శ్రీనివాస్‌గౌడ్, ఒలంపిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి, సీడీపీ వో సబిత, జిల్లా సైన్స్‌అధికారి జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చొప్పదండి : మండలంలోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌లో రోబోటిక్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్టిఫికెట్లను, రోబోటిక్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు

ఎస్సారార్ కళాశాలలో 5కే రెడ్ మారథాన్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ, పీజీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శనివారం 5కే రెడ్ మారథాన్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట్ల రామకృష్ణ అధ్యక్షతన 500 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. విజేతలుగా పురుషుల విభాగంలో విష్ణువర్ధన్ ప్రథమ బహుమతి, దశన్న అరవింద్ ద్వితీయ బహుమతి, ఇస్లావత్ నితిన్ తృతీయ బహుమతి గెల్చుకున్నారు. మహిళల విభాగంలో సీపెల్లి అనూష ప్రథమ, ఎంట్రికాయల అనువర్ష ద్వితీయ, జి.శిరీష తృతీయ బహుమతులను సాధించారు. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ కో- ఆర్డినేటర్ డాక్టర్ సురేందర్ రెడ్డి, హెచ్ఐవీ జిల్లా రీసోర్స్ పర్సన్ డాక్టర్ రమేష్ బహుమతులు అందజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపక సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా నిర్వహించాలి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం కోరారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా కమిషనరేట్ కేంద్రంలో శనివారం నగరంలోని మర్కజీ మిలాద్ కమిటీ, సున్నీ మర్కజీ మిలాద్ కమిటీ, మదరసా అన్వార్ ఉల్ ఉలూమ్ కమిటీల పెద్దలతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పండుగలకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు కల్పిస్తామన్నారు. అడిషనల్ డీసీపీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: వినాయక ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించే వారికి ప్రత్యేక బహుమతులను ప్రదానం చేస్తామని తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ ఆవరణలో గణేష్ ఉత్సవ శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంతో పాటు మండలంలోనివివిధ గ్రామాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలి టౌన్ సీఐ కరుణాకర్ అన్నారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

కాళికామాత సేవలో వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పొలాల అమావాస్య సందర్భంగా శనివారం కిసాన్‌నగర్‌లోని కాళికామాత ఆలయాన్ని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ కార్పొరేటర్లు గంట కల్యాణి శ్రీనివాస్, నేతికుంట యాదయ్య పాల్గొన్నారు.

కమ్యూనిస్టులకు మార్గదర్శకుడు

భగత్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టులకు మార్గదర్శకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అన్నారు. శనివారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సురవరం చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే ఉద్యమాల వైపు నడిచిన నాయకుడు సుధాకర్‌రెడ్డి అని కొనియాడారు. సుధాకర్‌రెడ్డి మరణం దేశ ప్రజానికానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్‌కుమార్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, గూడెం లక్ష్మి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై సర్వే

శంకరపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికల్‌లో మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై శనివారం ఇంటింటా సర్వే నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. జ్వరాలు ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని వారికి సూచించారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

హుజూరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో వీధి కుక్కల బెడదను నియంత్రించడానికి శనివారం మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ నుంచి ప్రత్యేకంగా శిక్షణ పొందిన బృందాలను తీసుకొచ్చి వివిధ కాలనీలోని వీధి కుక్కలను పట్టుకున్నారు. వీటిని ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌కు తరలించారు.

అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలకు జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి

భగత్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల రవీంద్రనాథ్ ఠాగూర్ 2025 జాతీయ అవార్డును గెలుచు కున్నది. హైదరాబాద్‌లోని నియో కన్వెన్షన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి ఏక్ ఉపదేశ్ మీడియా ప్రతి నిధుల చేతుల మీదుగా అవార్డు అందు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల రీజినల్ అకడమిక్ ఎక్సలెన్స్‌ని కైవసం చేసుకు ఒదన్నారు. రెండు నెలల క్రితం అవార్డు కేటగిరిలో నామినేషన్ వేయగా కళాశాల బోధన పద్ధతులు, బోధనా సిబ్బంది శాతంతోపాటు మూడు సంవత్సరాల ఉత్తీర్ణత, ప్లేస్‌మెంట్స్, ప్రయోగశాలలు, లైబ్రేరీ తదితర అంశాల్లో పరిగణనలోకి తీసుకుని అవార్డును ప్రకటించారన్నారు. శనివారం కళాశాల ఆవరణలో కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డిని ప్రిన్సిపాల్ సన్మానించారు.

కాశ్మీర్‌గడ్డ రైతు బజార్ పనులను వేగవంతం చేయాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌గడ్డ రైతు బజార్ సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని బీజేపీ నాయకుడు, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు కాంట్రాక్టు ఏజెన్సీని ఆదేశించారు. శనివారం కాశ్మీర్‌గడ్డ రైతు బజార్ మార్కెట్‌ను సందర్శించారు. నగరపాలక సంస్థకు చెందిన 10 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్న వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సునీల్‌రావు మాట్లాడుతూ ఇప్పటికే మార్కెట్ నిర్మాణం పనులు ఆలస్యమయ్యాయన్నారు. అధికారులు పనులను పర్యవేక్షించాలన్నారు. బీజేపీ మాజీ కార్పొరేటర్ తుల శ్రీదేవి చంద్రమౌళి, ఏజెన్సీ కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న నరేందర్‌రెడ్డి

అల్ఫోర్స్ ఈ-టెక్నోలో న్యూట్రిషన్ ఎక్స్పో

భగత్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో శనివారం నిర్వహించిన న్యూట్రిషన్ ఎక్స్పో ఆకట్టుకున్నది. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వినరేందర్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారంతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని, చిన్న పిల్లల ఎదుగుదలకు దోహదపడుతుందని అన్నారు. అనంతరం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

మట్టి విగ్రహాలను పూజించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, పోలీస్ కమిషనర్

కరీంనగర్ అర్బన్/సుభాష్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు దోహదపడే మట్టి విగ్రహాలను పూజించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. యువ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం' అనే నినాదంతో మట్టి గణపతులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ రూపొందించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేల సత్పతి మాట్లాడుతూ ఇంటింటా మట్టి గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలన్నారు. పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్‌డీవో మహేశ్వర్, యువ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, రాష్ట్ర ఉత్తమ యువజన అవార్డు గ్రహీత సత్తినేని శ్రీనివాస్ పాల్గొన్నారు

కరీంనగర్ రూరల్: నగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ తిరుపతి రావు మట్టిగణపతుల పోస్టర్‌లను ఆవిష్కరించారు. హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ తదితరులు ఉన్నారు.

మట్టి గణపతుల ప్రతిష్ఠాపనపై గాయత్రి పర్యావరణ సంస్థ రూపొందించిన పోస్టర్‌లను కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్‌కమిషనర్ గౌస్ అలం శనివారం ఆవిష్కరించారు.

కరీంనగర్ అర్బన్: రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన పర్యవేక్షణలో తయారు చేయించిన మట్టి గణపతులు, మొక్కలు, కుంకుమను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లకు పంపించారు. శనివారం పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, పొన్నం సత్యం, దేవేందర్‌లు వారికి అందజేశారు.

అవీఇవీ..

గణేశ్‌నగర్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం డిగ్రీ డైరీస్ పేరుతో ఫ్రెషర్స్ డే నిర్వహించారు.

సైదాపూర్: శంకరపట్నం మండలం తాడికల్‌లో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. నలుగురిని పట్టుకొని కేశవపట్నం పోలీసులకు అప్పగించారు.

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ అనిల్ శనివారం అవగాహన కల్పించారు.

సుభాష్‌నగర్: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం రెండవ ముఖ్య సంచాలకుడు కీర్తిశేషులు దాది ప్రకాశ్‌మణి 18వ స్మృతి దినోత్సవం సందర్భంగా బ్రహ్మకుమారీస్ సమాజ సేవ ప్రభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

నగరంలోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజీలో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించున్నట్లు విజయలక్ష్మి తెలిపారు.

మానకొండూర్: కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలల పాలనలో విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుగొండ నాగేశ్వర్‌రెడ్డి విమర్శించారు. మానకొండూర్‌లో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

కరీంనగర్ స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఏడుగురు రక్తదానం చేశారు.

పూజా సామగ్రి విక్రయానికి వేలం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జడ్పీ క్వార్టర్స్‌లోని వేంకటేశ్వర, అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షణలో వేలం నిర్వహించారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్మకానికి రూ. 3,56,000/-, టీ అమ్మకానికి రూ. 100000/-, కొబ్బరి ముక్కలు, చీరల పోగుకు రూ.25000/- వచ్చినట్లు ప్రకటించారు. లడ్డూ, పులిహోర అమ్మకం వేలం సెప్టెంబరు 3కు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. చైర్మన్ అనిల్‌కుమార్, ఈవో కాంతారెడ్డి పాల్గొన్నారు.

జ్వరాన్ని నిర్లక్ష్యం చేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నాగరాజు

సుభాష్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సీజనల్ జ్వరాలను నిర్లక్ష్యం చేయకూడదని, ఈ ఇన్‌ఫెక్షన్ బ్రెయిన్, కిడ్నీ, లివర్, గుండెకు ప్రమాదంగా మారుతుందని మెడికవర్ వైద్యులు తెలిపారు. శనివారం నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జ్వరం అనేది ఒక ఇన్‌ఫెక్షన్ అని, ముందుగా గుర్తించి మందులు వాడితే ప్రాణహాని నుంచి బయటపడవచ్చని తెలిపారు. న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సంజయ్‌కుమార్, నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్, మెడికల్ గ్యాస్ట్రో డాక్టర్ ప్రణీత్, కార్డియాలజిస్టు డాక్టర్ అనీష్‌పబ్బ, క్రిటికల్ కేర్ వైద్యులు డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్లు డాక్టర్ రావికంటి నాగరాజు, డాక్టర్ బీరాకాయల లోకేష్, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కరుణాకర్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ శ్రేణులు

భగత్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాస్, కొత్త ఆసరా పింఛన్లు వెంటనే అమలు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షుడు కుంట తిరుపతి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమలో అనిల్‌కుమార్, కడార్ల రతన్‌కుమార్, సోమినేని కరుణాకర్, బోనాల నరేష్, కదారి శ్రీనివాస్, పోర్తి అనిల్, కట్ల శ్రీనివాస్‌రెడ్డి, వంశి, మెరుగు మల్లేశం, బోయిని మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

26న విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

మానకొండూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల పదోతరగతి విద్యార్థులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చేతుల మీదుగా ఈ నెల 26న సైకిళ్లను పంపిణీ చేపట్టనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. మానకొండూర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సైకిళ్ల పంపిణీకి స్థలాన్ని శనివారం పరిశీలించారు. ఎంఈవో మధుసుదనాచారి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుగొండ నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు ఉన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి

యూత్ కాంగ్రెస్ రిలే నిరాహార దీక్ష



దీక్షలో కూర్చున్న నాయకులు

గణేశ్‌నగర్,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సెక్రెటరీ గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ జ్ఞాన్ ప్రతిష్ఠ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు వుమ్మెంతుల శ్యాంసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో గీతాభవన్ చౌరస్తా వద్ద ఓట్ చోర్ మోదీ హటావో దేశ్ కి బచావో నినాదంతో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కాంగ్రెస్ నేత వుట్కూరు నరేందర్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. సాయంత్రం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రావణ్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు తాజుద్దీన్ సంఘీభావం తెలిపారు. యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ జనహిత పాదయాత్ర

(5వ పేజీ తరువాయి)

పార్టీని మరింత పటిష్ఠం చేసే లక్ష్యంగా ఈ పాదయాత్ర జరుగుతున్నదని తెలుస్తున్నది.

● పార్టీ పరిస్థితిపై క్షేత్ర స్థాయిలో దృష్టి

జిల్లాలో ఇప్పటి వరకు 70 శాతం నామినేటెడ్ పద వులు భర్తీ కాకపోవడం, పార్టీ కమిటీల్లో కూడా చాలాకాలంగా పనిచేస్తున్న వారికి అవకాశాలు కల్పించే చర్యలు చేపట్టకపోవడంతో పార్టీ శ్రేణుల్లో, ద్వితీయ శ్రేణి నాయకుల్లో నిరాశ నిస్పృహలు పెరిగిపోతున్నాయి. పలు ఎంక్వైరీలు నిర్వహించి ఆయా పదవుల్లో నియమించడా నికి నేతల పేర్లతో జాబితాలు రూపొందించి పీసీసీకి చేర్చి నా వాటిపై ఇంకా పార్టీ నాయకత్వం ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో శ్రేణుల్లో పనిచేయడానికి ఉత్సాహం లేకుండా పోయిందని పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ అసంతృప్తిని తొలగించే విధంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పార్టీ సమావేశంలో తమ ప్రణాళికను ప్రకటిస్తారని తెలుస్తున్నది. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఇటీవల హైదరాబాద్‌లో సమావేశమై జిల్లాలో నియోజకవర్గాల వారీగా చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ఇక్కడ జరిగే సమావేశంలో పార్టీ క్షేత్రస్థాయి నేతల నుంచి వచ్చే ప్రతిపాదనలను కూడా విని పరిశీలించి ఆ దిశగా చర్యలు తీసుకుంటారని చెబుతున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి త్వరలోనే ఆర్థిక, రోడ్లు, భవనాల శాఖ, నీటి పారుదల శాఖ మంత్రులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ముఖ్యమైన సమస్యలు పరిష్కరించేందుకు ప్రణాళిక రూపొందిస్తామని హామీ ఇచ్చారు. ఆర్థిక, నీటి పారుదల శాఖ మంత్రులు ఈ పాదయాత్రలో పాల్గొంటున్న నేపథ్యంలో ఆయా శాఖలకు సంబంధించిన కొన్ని నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. జిల్లాలోని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా ఉన్న పురుమల్ల శ్రీనివాస్‌ను పార్టీ సస్పెండ్ చేసింది. ఆయన స్థానంలో ఇన్‌చార్జిగా ఎవరిని నియమించలేదు. దీంతో ఈ నియోజకవర్గంలో పార్టీ బాధ్యతలు ఎవరు నిర్వహించాలన్నది సమస్యగా మారింది. నియోజకవర్గ ఇన్‌చార్జి నియామకం విషయంలో మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబులకు మధ్య ఏకాభిప్రాయం లేకపోవడం కూడా ఇందుకు ఒక కారణంగా పేర్కొంటున్నారు. ఈ సమావేశంలో ఇది కూడా చర్చకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తున్నది. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయకపోవడంతో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం పెండింగ్ పడిపోయింది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్ల నిర్మాణాలు చేపట్టి వేగంగా పనులు కొనసాగుతున్నా ఈ నియోజకవర్గంలో మాత్రం ఆ పరిస్థితి లేకపోవడంతో ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేద, దిగువ మధ్య తరగతి ప్రజల్లో అసంతృప్తి, అసహనం పెరిగిపోతున్నది. ఈ అంశం కూడా పార్టీ పరిశీలనకు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

పరిశోధన కేంద్రాలుగా గుర్తింపు

గణేశ్‌నగర్,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ అటానమస్ కళాశాలలోని తెలుగు, కామర్స్, వృక్ష శాస్త్ర విభాగాలను పరిశోధన కేంద్రాలుగా గుర్తిస్తూ శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ జాస్తి రవి కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ శనివారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అర్హులైన అధ్యాపకులు పరిశోధన పర్యవేక్షకుల గుర్తింపు కోసం సెప్టెంబరు 5లోగా ఎస్‌యూలో దరఖాస్తులను సమర్పించాలని నోటిఫికేషన్ వచ్చినట్లు పేర్కొన్నారు.

ఏపీ పర్యటనకు మార్కెట్ కమిటీ పాలకవర్గం

సైదాపూర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సైదాపూర్‌లో నూతనంగా ఏర్పాటైన వ్యవసాయ మార్కెట్ నిర్మాణంలో భాగంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం, అధికారులు మార్కెట్‌ల నిర్మాణం, అభివృద్ధిపై పరిశీ లించేందుకు ఏపీ పర్యటనకు వెళ్లారు. విశాఖపట్నం, గుంటూరు మార్కెట్ కమిటీలను పరిశీలించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, వెన్నేపల్లి ఎల్ఎస్‌సీఎస్ చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు ఉన్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు పరామర్శ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు రాజేశం ఇటీవల అనారోగ్యంతో మరణించగా టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యవర్గం శనివారం ఎమ్మెల్యేను పరామర్శించారు. టీఎన్‌జీఓస్ నాయకులు గూడ ప్రభాకర్‌రెడ్డి, సర్దార్ హర్మేందర్‌సింగ్, ఒంటెల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విలువలతో కూడిన పాత్రికేయులుగా రాణించాలి

గణేశ్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన పాత్రి కేయులుగా రాణించాలని కవి, పాత్రికేయుడు అన్నవరం దేవేందర్ అన్నారు. నగరంలోని ఎస్సారార్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో శనివారం జర్నలిజం కోర్సు విద్యార్థలకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిజం సహసంతో కూడుకున్న వృత్తి అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్లూబెల్స్‌లో కృష్ణాష్టమి వేడుకలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని హనుమాన్ నగర్ బ్లూబెల్స్ పాఠశాలలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ జంగ సునీతా మనోహరరెడ్డి వేడుకలను ప్రారంభించారు. రాధాకృష్ణుల వేషధారణల్లో విద్యార్థులు ఆకట్టుకున్నారు.

అచీవర్స్‌లో..

గణేశ్‌నగర్: కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్. వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి తదితరులు పల్గొన్నారు.

రచనలకు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సామాజిక సమరసతా కళా మండలి ఆధ్వర్యంలో సామాజిక సమరసతా నిర్మాణం లక్ష్యంగా రచనలను ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకుడు బండిరాజుల శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 6వ తేదీగా 9948050608, 9010202916 నంబర్లలో సంప్రదించి పంపాలని సూచించారు.

విద్యార్థులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

గణేశ్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని స్టూడెంట్ మేనేజ్‌మెంట్ రాంనగర్‌లో ఉన్న గిరిజన బాలుర హాస్టల్ విద్యార్థులపై మూడు రోజుల కిందట దాడి చేసిన దుండగులను శిక్షించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు గుగులోతు రాజు నాయక్ డిమాండ్ చేశారు. శనివారం దుండగుల దాడిలో గాయపడిన విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రక్షణ కల్పించడంలో గిరిజన సంక్షేమ అధికారి విఫలమయ్యారని ఆరోపించారు.

హుస్టన్‌ను సందర్శించిన ఎస్‌యూ వైస్ చాన్సలర్

గణేశ్‌నగర్,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఉమేష్ కుమార్ అమెరికా పర్యటనలో భాగంగా హుస్టన్ నగరాన్ని సందర్శించారు. అక్కడి మేధావులు, పూర్వ విద్యార్థులను కలిసి మీట్ అండ్ గ్రీట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణలో శాతవాహన విశ్వవిద్యాలయాన్ని బలోపేతం చేయాలని కోరారు.

ప్రతీ ఒక్కరిలో జాతీయ భావం పెంపొందించాలి

హుజూరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరిలో జాతీయ భావం పెంపొందించేలా ఏబీవీపీ కార్యకర్తలు కృషిచేయాలని జిల్లా కన్వీనర్ పూసల విష్ణు అన్నారు. శనివారం హుజూరాబాద్‌లో ఏబీవీపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు అనంతరం గోస్కుల అజయ్ ఆధ్వర్యంలో నూతన పట్టణ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగర కార్యదర్శిగా అంజి, ఉపాధ్యక్షులుగా అజయ్, కిరణ్, వినయ్, రంజిత్ ఎన్నికయ్యారు.

'ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి'

హుజూరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అవగాహన లేమితో కొత్త రేషన్‌కార్డులు రావడం లేదని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని నియోజకవర్గ కాంగ్రెస్‌ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రేషన్‌కార్డులు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్‌కార్డులు అందించామని తెలిపారు.

జమ్మికుంట: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కాంగ్రెస్‌పై దుష్ప్రచారం మానుకోవాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు అన్నారు. శనివారం జమ్మికుంటలో విలేకరులతో మాట్లాడారు.